సాక్షి
కాకినాడ
ఆదివారం । 22 । జూన్ । 2025



రూ.2,01,116 లక్షల విరాళాలు


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ములకల సుబ్బారావు (కాకినాడ) రూ.1,01,116, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు రూ.లక్ష చొప్పన విరాళాలిచ్చారు.



విఘ్నేశ్వరునికి బంగారు సూత్రాలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామికి మునుకుంట్ల సూర్యమోహన్ దంపతులు (ఇనుకపూడి) రూ.లక్ష విలువైన 11 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు 4 సమర్పించారు.

డెల్టాలకు 12,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 12,100 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్


సీతారాములకు వెండి మకర తోరణం అలంకరణ



నిత్య కల్యాణంలో సత్యదేవుని సింహాసనం పక్కనే వెండి మకర తోరణం అలంకరణతో సీతారాములు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు నిర్వహించే నిత్య కల్యాణంలో పెళ్లిపెద్దలుగా వ్యవహరించే క్షేత్ర పాలకులు సీతారాములకు శనివారం వెండి మకర తోరణం అలంకరించారు. దీంతో, స్వామి, అమ్మవార్లు ప్రత్యేక శోభతో ప్రకాశించారు. గతంలో నిత్య కల్యాణం సందర్భంగా సత్యదేవుడు, అమ్మవార్లను వెండి సింహాసనంపై వేంచేయించి, వారి పాదాల దగ్గరలో సీతారాములను ఉంచేవారు. దీంతో, సత్యదేవుడు, అమ్మవారిపై వేసిన అక్షింతలు, తలంబ్రాలు సీతారాములపై కూడా పడేవి. భక్తులు దీనిని అపచారంగా భావించేవారు. దీనిపై 'సత్యదేవుని నిత్య కల్యాణంలో అపచారం' శీర్షికన గత ఏడాది జూన్ 24న 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అప్పటి ఈఓ, ప్రస్తుత కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సత్యదేవుడు, అమ్మవారి సింహాసనం పక్కనే సీతారాములను మరో ఆసనంపై ఉంచి, నిత్య కల్యాణం నిర్వహించాలని ఆదేశించారు. అప్పటి నుంచీ అలాగే చేస్తున్నారు. అయితే, సత్యదేవుడు, అమ్మవార్ల మాదిరిగా సీతారాముల ఉత్సవ మూర్తుల వెనుక మకర తోరణం లేకపోవడంతో బోసిపోయినట్టుండేది. ఈ నేపథ్యంలో వ్రత పురోహిత సూపర్‌వైజర్లు అల్లంరాజు సత్య శ్రీనివాస్, గుత్తిన రామకృష్ణ, వ్రత పురోహిత సంఘం మాజీ అధ్యక్షుడు రవిశర్మ, వారి డ్యూటీ సభ్యులు 43 మంది కలసి రూ.3 లక్షలతో 345 గ్రాముల వెండితో మకర తోరణం తయారు చేయించి సీతారాములకు ఈ నెల 12న సమర్పించారు. దీనిని ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం సీతారాములకు అలంకరించారు. ఇక నుంచి ప్రతి రోజూ సీతారాములకు ఇదేవిధంగా మకర తోరణం అలంకరించి సత్యదేవుని నిత్య కల్యాణం నిర్వహిస్తామని అధికారులు చెప్పారు.

145 మంది వైద్యుల నమోదు



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న డాక్టర్ చిట్ల కిరణ్, డాక్టర్ జీఎస్ మూర్తి

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) డిజిటల్ లైబ్రరీలో జిల్లా స్థాయి వైద్యుల నమోదు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఏపీ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యాన కళాశాల నిర్వహణలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 145 మంది వైద్యులు హాజరై లైసెన్స్ రెన్యువల్స్, రీ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఐఎంఏ కాకినాడ కార్యదర్శి డాక్టర్ చిట్ల కిరణ్ తెలిపారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలోనే జిల్లాల పరిధిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐఎంఏ కాకినాడ అధ్యక్షుడు డాక్టర్ మోకా పవన్‌కుమార్, రామ్‌కోసా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎంవీ ఆనంద్, డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న మాట్లాడుతూ, విజయవాడలోని ఏపీ మెడికల్ కౌన్సిల్ నుంచి 15 మంది నిష్ణాతులైన సిబ్బంది వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, ఉమ్మడి విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఇదే తరహా రిజిస్ట్రేషన్లు నిర్వహించారన్నారు. తగిన నమోదు లేకుండా ప్రాక్టీస్ చేయడం నేరమని, లైసెన్సు పునరుద్ధరణ తప్పనిసరని పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించే నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియను ఐఎంఏ పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జీఎస్ మూర్తి, డాక్టర్ సంపత్ కుమార్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు పరిశీలించారు.

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు

పెరవలి: ఏకాదశి పర్వదినం కావడంతో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వందలాదిగా భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరి మరీ స్వామిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను అర్చకులు విశేషంగా అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు.

కస్సుబుస్సులు

- ప్రయాణికులకు 'యోగాంధ్ర' కష్టాలు
- ఉమ్మడి 'తూర్పు' నుంచి 502 బస్సులు 'చలో వైజాగ్'
- ప్రయాణాలకు నరకం చూసిన జనం
- ఆర్టీసీ బస్టాండ్లలో గంటల తరబడి పడిగాపులు



సీటు కోసం పాట్లు : రాజమహేంద్రవరంలో రాకరాక వచ్చిన బస్సులోకి తోసుకుంటూ ఎక్కుతున్న జనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆర్టీసీ బస్సు రూటు మారింది.. యోగాంధ్ర రికార్డు కోసం విశాఖపట్నం దారి పట్టింది.. ఫలితంగా ఇబ్బందులు పడటం ప్రయాణికుల వంతయ్యింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. దీనిని గొప్పగా నిర్వహించామని చెప్పుకొనేందుకు, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు ప్రహసనం నడిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా వారం రోజులుగా అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులనూ యోగాంధ్ర కార్యక్రమం పైనే మోహరించారు. దీనికి ముగింపుగా విశాఖలో ప్రధాని పాల్గొనే యోగా దినోత్సవానికి భారీగా జనాల్ని తరలించేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి వందలాదిగా ఆర్టీసీ బస్సులతో పాటు వివిధ ప్రైవేటు పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలల బస్సులను వినియోగించారు. దీనికోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం గురువారం నుంచి శనివారం వరకూ మూడు రోజుల పాటు సెలవులు కూడా ప్రకటించింది.

జిల్లాల వారీగా..

- కాకినాడ జిల్లా నుంచి ఆర్టీసీ 155 బస్సులను విశాఖకు తరలించారు. ఈ నేపథ్యంలో కాకినాడ - రాజమహేంద్రవరం, కాకినాడ - అమలాపురం నాన్‌స్టాప్ సర్వీసులను కుదించేశారు. నాన్‌స్టాప్ బస్సుల కోసం గంట, రెండు గంటల పాటు వేచి చూడాల్సిన దుస్థితి ఎదురవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ - రాజమహేంద్రవరం, కాకినాడ - విజయవాడ సర్వీసులలో కోత పెట్టారు. కాకినాడ నుంచి మెట్ట ప్రాంతమైన జగ్గంపేట, గోకవరం, ఏలేశ్వరం, తుని తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్డినరీ సర్వీసులలో రెండింతలు కోత పెట్టడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- తూర్పు గోదావరి జిల్లాలోని 4 డిపోల నుంచి 185 బస్సులను విశాఖకు తరలించుకుపోయారు. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు ఆర్టీసీ డిపోల్లో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు మండిపడ్డారు. రాజమహేంద్రవరం మెయిన్ బస్టాండుతో పాటు రైల్వేస్టేషన్, గోకవరం బస్టాండ్, కోటిపల్లి బస్టాండ్‌ల వద్ద ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు.
- కోనసీమ జిల్లాలోని 4 డిపోల నుంచి మొత్తం 162 బస్సులను విశాఖ యోగాంధ్ర కార్యక్రమానికి తరలించారు. జిల్లా కేంద్రమైన అమలాపురం నుంచి విజయవాడకు ప్రతి అరగంటకు ఒక బస్సు నడిచేది. అటువంటిది విశాఖకు బస్సులు తరలించేయడంతో రెండు గంటలకొకటి చొప్పున మాత్రమే బస్సులు నడపడంతో ప్రయాణికులు నానా కష్టాలూ పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు, నైట్ సర్వీసులు సైతం దాదాపు మూడు వంతులు రద్దు చేశారు. అమలాపురం - కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులను కూడా తగ్గించేశారు. ఈ రూటులో ప్రతి అరగంటకు ఒక నాన్‌స్టాప్ తిరిగేది. చలో విశాఖ ప్రభావంతో రెండు గంటలైనా నాన్‌స్టాప్ సర్వీసు లేక ప్రయాణికులు నరకం చవి చూశారు. విజయవాడ, విశాఖపట్నంతో పాటు పల్లె వెలుగు సర్వీసులను కొన్ని రూట్లలో రద్దు చేశారు. అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, రాజోలు డిపోల నుంచి స్వల్ప సంఖ్యలోనే బస్సులు నడపడం ప్రయాణికులకు శాపంగా మారింది. కోనసీమ జిల్లాలో సమారు 300 ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల బస్సులను యోగాంధ్రకు వినియోగించడంతో ఆయా విద్యా సంస్థలకు మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారు.



చంటిబిడ్డలతో సీటు కోసం పాట్లు



ష్.. ఒక్క బస్సూ లేదు : రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల పడిగాపులు



బస్సు వచ్చేంత వరకూ వేచి ఉండక తప్పదు : రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వేచి చూస్తున్న ప్రయాణికులు

బోసిపోయిన బస్టాండ్లు

ఉమ్మడి జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల నుంచి 502 బస్సులను విశాఖ యోగాంధ్ర కార్యక్రమానికి తరలించుకుపోయారు. ఇంతకు రెట్టింపు సంఖ్యలో ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను రవాణాశాఖాధికారుల ద్వారా నయానా భయానా దారికి తెచ్చుకుని వినియోగించారు. విద్యా సంస్థల బస్సుల మాటెలా ఉన్నా ఆర్టీసీ బస్సులు తగినన్ని లేకపోవడంతో ఆయా బస్టాండ్లలో ప్రయాణికులు శుక్ర, శనివారాల్లో తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేక ఆర్టీసీ బస్టాండ్లు బోసిపోయాయి. దూర ప్రాంతాలతో పాటు పల్లెవెలుగు బస్సులు కూడా తగినన్ని లేకపోవడంతో ప్రయాణికులు నరకం కళ్లజూశారు. బస్సుల కోసం గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు పడ్డారు. పల్లెలకు వెళ్లే సర్వీసులను దాదాపు రద్దు చేశారు. నడినెత్తిన సూరీడు చుర్రుమంటున్నా.. రోడ్డు పైనే బస్టాప్‌ల వద్ద గంటల తరబడి చెమటలు కక్కుతూ పడిగాపులు పడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పలువురు ప్రయాణికులు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇదే అదనుగా కొన్ని ప్రాంతాల్లో ఆటోలకు డబుల్ చార్జీలు కూడా డిమాండ్ చేశారు. పలుచోట్ల ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి డిపోల వారీగా విశాఖకు తరలించిన ఆర్టీసీ బస్సులు

డిపో	మొత్తం బస్సులు	విశాఖకు తరలించినవి	మిగిలినవి
కాకినాడ	166	66	100
తుని	72	44	28
ఏలేశ్వరం	49	45	4
అమలాపురం	143	60	83
రావులపాలెం	71	41	30
రామచంద్రపురం	52	40	12
రాజోలు	53	21	32
రాజమహేంద్రవరం	148	77	71
గోకవరం	63	44	19
కొవ్వూరు	52	39	13
నిడదవోలు	37	25	12

రత్నగిరి.. కిక్కిరిసి..

- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- రూ.50 లక్షల ఆదాయం

అన్నవరం: ఏకాదశి పర్వదినం కావడంతో వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో సత్యదేవుని దర్శనానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ కిక్కిరిసిపోయాయి. సుమారు 50 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని వ్రతాలు 2,500 నిర్వహించారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టుకు ప్రదక్షిణ చేసి, జ్యోతులు వెలిగించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. ఏకాదశి తిథిని పురస్కరించుకుని సత్యదేవునికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు స్వర్ణ పుష్పార్చన, 9 నుంచి 11 గంటల వరకూ స్వామి, అమ్మవార్లకు తులసి దళాలతో సహస్రనామార్చన ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, అర్చకులు శర్మ, వేంకటేశ్వర్లు, పరిచారకులు యడవిల్లి చిన్న తదితరులు నిర్వహించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఉదయం ఘనంగా ఊరేగించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను టేకు రథంపై ఊరేగించనున్నారు. భక్తులు రూ.2,500 టికెట్టుతో ఈ సేవలో పాల్గొనవచ్చు.

రేపు యువత పోరు



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరుణ్‌కుమార్, రాంజీ, రోకళ్ల తదితరులు

- విజయవంతానికి నేతల పిలుపు
- పోస్టర్ ఆవిష్కరణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): యువత, విద్యార్థులకు ఇచ్చిన మాట తప్పిన కూటమి సర్కార్‌కు బుద్ధి వచ్చేలా తలపెట్టిన యువత పోరు అందోళనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్ కుమార్ (బన్నీ) పిలుపునిచ్చారు. పార్టీ యువజన, విద్యార్థి విభాగాలు సమన్వయం చేసుకుంటూ సోమవారం తలపెట్టిన యువత పోరును విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ యువత పోరు పోస్టర్‌ను అరుణ్‌కుమార్ ఆధ్వర్యాన పార్టీ యువ నేతలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బన్నీ మాట్లాడుతూ, ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిని విస్మరించిందన్నారు. నిరుద్యోగులకు తక్షణమే భృతి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి హామీ కొండెక్కించారని సంయుక్త కార్యదర్శి ఎంజీకే కిషోర్ ఆక్షేపించారు. యువగళం పేరుతో మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఏటా జనవరి 1న నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీ ఏమైందని సిటీ అధ్యక్షుడు రోకళ్ల సత్యనారాయణ, ఉలవల భూషణం ప్రశ్నించారు. కార్యక్రమంలో దాసం వెంకటేష్, కరణం భాను, వీరంరెడ్డి నాని, సకురు గుర్రాజు, తిరుమల శెట్టి లక్ష్మీకాంత్, సీడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్మా... ఇదేంటి చెప్మా!

పిఠాపురం: ఈ వంటకం చూస్తే.. ఇదేదో కొత్త పాయసం అనుకుంటే పొరబడినట్టే. ఇది సర్కారు బడిలో వడ్డించిన ఉప్మా. అయ్య బాబోయ్.. ఇదేంటి అనుకుంటున్నారా! నిజమేనండోయ్... పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అల్పాహారంగా ఈ నీళ్ల ఉప్మా శనివారం వడ్డించారు. యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఉప్మా నీళ్ల మాదిరిగా ఉండడంతో పాటు ఉండలు కట్టి ఎక్కడి నూక కనిపించడంతో విద్యార్థులు పారేశారు. మధ్యాహ్న భోజనం సైతం నాసిరకంగా ఉండడంతో విద్యార్థులు ఆకలితో ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి కనిపించింది.



పాయసం కాదు.. నీళ్ల ఉప్మా



ఉండలు కట్టి నూక కనిపించేలా ఉప్మా



ఆ ఉప్మాను ఇలా చెత్త బుట్టలో పడేసి...

నిత్యజీవనయోగం కావాలి

- కలెక్టర్ షణ్మోహన్
- ఘనంగా జిల్లా స్థాయి యోగా దినోత్సవం

కాకినాడ సిటీ: శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగాను ప్రతి ఒక్కరూ నిత్య జీవనంలో భాగంగా మలచుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కాకినాడ మూడు లైట్ల జంక్షన్, దేవదాయ శాఖ కార్యాలయం రోడ్డులో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్, విశిష్ట అతిథులుగా జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నగరపాలక సంస్థ కమిషనర్ భావన పాల్గొన్నారు. తొలుత పతంజలి మహర్షి చిత్రపటానికి పూలు అలకరించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 3 వేల మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలతో యోగాచార్య రాఘవానంద యోగాభ్యాసం, ప్రాణాయామ ప్రక్రియలు చేయించారు. యోగా చేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. రాజయోగ సాధన గురించి బ్రహ్మకుమారి రజనీ దీదీ వివరించి, ధ్యాన ప్రక్రియ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, నెల రోజులుగా జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం ఎటువంటి అపశ్రుతులూ లేకుండా నిర్వహించామని, ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ, యోగ విద్య భారతీయుల విశిష్ట సంపదని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించిన యోగాచార్యులను, శిక్షకులను, ఆయుష్ తదితర శాఖల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సత్కరించారు. శుభా నికేతన్, పిఠాపుర యోగ విద్యాపీఠం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, బిస్మిల్లాఖాన్ వాయిద్య సంగీతానికి అనుగుణంగా యోగాచార్య రాఘవానంద ఆధ్వర్యాన పతంజలి యోగా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు నిర్వహించిన యోగా ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డీఎఫ్ఓ డి.రవీంద్రనాథ్‌రెడ్డి, డీఆర్ఓ జె వెంకటరావు, ఆయుష్ విభాగం అధికారి డాక్టర్ ఎంఎస్ అలీ, డీఎంహెచ్ఓ జె.నరసింహనాయక్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, మెప్మా పీడీ ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ షణ్మోహన్, అధికారులు, ప్రజలు



యోగాసనాలు వేస్తున్న ప్రజలు



యోగాసనాలతో ఆకట్టుకున్న విద్యార్థినులు

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. ఏకాదశి పర్వదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 15 వేల మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. శృంగార వల్లభుడిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేశఖండన, వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాలుగా స్వామి వారికి రూ.3,09,209 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. సుమారు 3,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

చల్లని తల్లి... మా కల్పవల్లి

- పెద్దాపురం మరిడమ్మ జాతరకు వేళాయె
- తెలుగు రాష్ట్రాల్లోనే వేడుకలకు ప్రసిద్ధి
- 24 నుంచి జాతర మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ వారు



విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయం

పెద్దాపురం: చల్లని తల్లి... మా కల్పవల్లి... మమ్మేలు మాతా అంటూ ఆ మరిడమ్మ వారిని భక్తజనం కొలుస్తుంది. ఆధ్యాత్మికతతో అలరారుతున్న, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన, ఉమ్మడి రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 24 నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. ఏటా 37 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా 24న జాతర ప్రారంభమై, జూలై 31వ తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఏటా లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. నిత్యం విశేష పూజలందుకుంటూ విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ ఉత్సవాలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

చింతపల్లివారి ఆడపడుచుగా...

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో దేవతాలయాల్లో పెద్దాపురం శ్రీమరిడమ్మ అమ్మవారి దేవస్థానం ప్రసిద్ధమైంది. మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని సందర్శిస్తే కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల నమ్మకం. మరిడమ్మ వారు సామర్లకోట చింతపల్లివారి ఆడపడుచుగా ప్రాచుర్యం పొందారు. ఇప్పటికీ ఆ వారుసులే ఇక్కడ ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. వారి కుల దేవతగా పెద్దాపురం పట్టణంలో వెలసి యావత్ ఆంధ్రావని సంరక్షిస్తున్న వరదేవతగా ప్రఖ్యాతి గాంచారు. ఏటా ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు జాతరను జరపడం ఆనవాయితీగా వస్తోంది.

గరగ ఊరేగింపు ఆనవాయితీ

ఆషాఢ మాసంలో అమ్మవారి జాతరకు ఉన్న ప్రత్యేకతతో పాటు గరగకు విశిష్ట పూజలు నిర్వహిస్తుంటారు. జాతర ఆరంభానికి ముందు నుంచీ తొలి గరగను ఊరేగించడం ఆనవాయితీ. పురవీధుల్లో గరగ తిరుగుతూ డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తుంటే భక్తులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అమ్మవారికి పాన్పు, చీరలు వేయడం, కోరిన కోర్కెలు తీర్చడంతో ముడుపులు, మొక్కులు తీర్చుకునేందుకు వేల సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వస్తుంటారు.



పెద్దాపురంలో మరిడమ్మ గరగకు ఊరేగింపు (ఫైల్)

వారానికో వీధి సంబరం

గ్రామ దేవతగా ఆరాధించే పెద్దాపురంలో ఆయా వీధుల వారు అమ్మవారి సంబరాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రూ.లక్షలు వెచ్చించి అమ్మవారి సంబరం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వీధి సంబరాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు సిద్ధమవుతున్నాయి. ఇది పట్టణంలో ప్రత్యేకతను చాటనుంది.

24న రాత్రి నుంచి జాతర

ఏటా ఆషాఢ మాసం ఆరంభంలో నిర్వహించే మరిడమ్మ వారి జాగరణ మహోత్సవంలో భాగంగా ఈ నెల 24న రాత్రి అంగరంగ వైభవంగా జాతర ప్రారంభం కానుంది. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రులతో పాటు ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే హాజరవుతారు. జాతరకు సంబంధించి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆసాదుల, వేదపండితులతో అమ్మవారి జాతర ఉత్సవం నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో సెట్టింగ్‌లు వేశారు.

అమ్మవారి కృపకు పాత్రులుకండి



కోరిన కోర్కెలు తీర్చే మరిడమ్మ వారి కృపకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలి. ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై జాతరను విజయవంతం చేయండి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ఏడాది ఉత్సవాలను మరింత వేడుకగా నిర్వహించనున్నాం.

– విజయలక్ష్మి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్, పెద్దాపురం

లారీ ఢీకొని సచివాలయ ఉద్యోగి మృతి

బిక్కవోలు: రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి చెందిన ఘటన పందలపాక శివారులో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కాకినాడ భానుగుడి శ్రీరామ్ నగర్ ప్రాంతానికి చెందిన గొల్ల మహంతి బాల వెంకటేష్ (29) పందలపాక సచివాలయం-2లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి ఇక్కడ సేవలు అందిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం ఇంటి నుంచి సచివాలయానికి వచ్చారు. అక్కడ గ్రామస్తులతో కలసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బిక్కవోలులో ఇంజినీర్ కార్యాలయానికి బయలు దేరారు. తాను పని చేస్తున్న సచివాలయం నుంచి కనీసం 400 మీటర్ల దూరంలో పందలపాక - ఊలపల్లి రోడ్డు వద్ద బిక్కవోలు వెళ్తున్న సిమెంట్ లోడు లారీ ఒక్కసారిగా కుడివైపు తిప్పి అతని బైక్‌ను కొట్టడంతో వెంకటేష్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఆ లారీ వెంటనే అతని తలపై నుంచి వెళ్లిపోయింది. వెంకటేష్ తలకు హెల్మెట్ ఉన్నా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన స్థలానికి భారీఎత్తున గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు చేరుకున్నారు. ప్రమాద తీరును ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య కావ్యసత్యశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



గొల్ల మహంతి బాల వెంకటేష్ (ఫైల్)

పందలపాకలో విషాదం

ఐదేళ్లుగా సచివాలయ ఉద్యోగిగా బాధ్యతలు చేపడుతూ, అందరితో సరదా ఉండే ఉద్యోగి ఇలా మృతి చెందడంతో స్థానికులు మదనపడుతున్నారు. తమ్ముడు అనే పిలిచే వ్యక్తి ఇలా అకాలంగా మరణించడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ఎప్పుడూ బైక్ నడిపినా హెల్మెట్ వాడేవాడని, అందరినీ హెల్మెట్ పెట్టుకోవాలని చెప్పేవాడని, అలాంటి వ్యక్తి బైక్ ప్రమాదంలో మృతి చెందడంతో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, మిత్రులు తమ్ముడు ఇక రాడంటూ ఆవేదన చెందుతున్నారు. తల్లిదండ్రులకు ఇతనే ఒక్కగానొక్క కుమారుడు. రెండేళ్ల కిందట దగ్గర బంధువని కావ్యసత్యశ్రీతో వివాహం జరిపించారు. కుటుంబానికి ఆసరా ఉంటాడని అనుకున్న కొడుకు ఇక లేకపోవడంతో తల్లిదండ్రులు, జీవితాంతం తోడుగా ఉంటానని చెప్పిన భర్త ఇకలేడని తెలిసి భార్య కావ్యసత్యశ్రీ బోరున విలపిస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ లీజులు రద్దు చేయాలి



తునిలో ఆదివాసీ సంఘ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

తుని: ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్‌కు ఇచ్చిన లీజులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘ అధ్యక్షుడు జక్కంపూడి రాజు డిమాండ్ చేశారు. శనివారం తునిలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘ రాష్ట్ర కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. శ్రీకాకుళం, మన్యం పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఆదివాసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మైదాన ప్రాంతాల్లోని ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలని, శంఖవరం మండలం పెదమల్లాపురం మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 యాక్ట్‌కు ఎటువంటి మినహాయింపులు లేకుండా అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ మాఫియాను అరికట్టి, ఆదివాసీలపై జరుగుతున్న కగారు ఆపరేషన్ తక్షణం నిలుపుదల చేసి, అక్రమ కేసుల్లో ఇరికించిన ఆదివాసీలను విడుదల చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు, ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేయించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను వలస భూస్వాములు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని, వీరి నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వచ్చే నెల 13, 14 తేదీల్లో అన్నవరంలో రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహించేందుకు నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా కన్వీనర్ మోసూరి రాజు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన సన్యాసిరావు, మన్యం జిల్లా నుంచి కర్ర ఏసు, కాకినాడ జిల్లా నుంచి రేచుకట్ల సింహాచలం, ముసలయ్య, బాలరాజు, పందిరి ప్రసాద్ పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్‌లు ఆదివాసీ సంఘం చేపడుతున్న కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.